క్లుప్తంగా

మందుబాబులపై కేసులు



తెనాలిరూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారికి రూరల్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కేసులు నమోదు చేశారు. తెనాలి మండలంలోని కొలకలూరు వంతెన వద్ద హాఫ్‌పేట గ్రామంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న నలుగురిని రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి గుర్తించారు. వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని ఎస్‌ఐ హెచ్చరించారు.

విల్హెల్మ్ రోంట్జెన్ సేవలు మరువరానివి



తెనాలిఅర్బన్: విల్హెల్మ్ రోంట్జెన్ సేవలు మరువరానివని జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యశాలలోని ఎక్స్‌రే విభాగంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌రే పితామహుడు విల్హెల్మ్ రోంట్జెన్ చిత్రపటానికి బుధవారం ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1895 నవంబర్ 8న ఆయన ఎక్స్‌రే కనుగొన్నట్లు చెప్పారు. 1901లో నోబెల్ ప్రైజ్‌ను ఆయన అందుకున్నారని తెలిపారు. నవీన్, జానీబాషా, జయకర్, గుంటూరు రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండండి



తెనాలిఅర్బన్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ సీపీ 29వ వార్డు కౌన్సిలర్ రమావత్ కవితాభాయ్ కోరారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లోని వడ్డెర కాలనీలో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. మురుగు కాల్వలో ఆయిల్ బాల్స్ వేసి స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు లేకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, వై.అనుపమ, వై.లక్ష్మీనారాయణ, సచివాలయ అడ్మిన్ రాజ్‌కుమార్, సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్ధులను చేసిన సంపత్‌కుమార్ గానం



తెనాలి: తెనాలిలో శాస్త్రీయ సంగీత ఉత్సవాలు సంగీతాభిమానులకు వీనుల విందు చేస్తున్నాయి. పట్టణానికి చెందిన ప్రసిద్ధ సంగీత సంస్థ శ్రీసీతారామ గానసభ ఆధ్వర్యంలో ఇక్కడి పెన్షనర్స్ హాలులో జరుగుతున్న సంగీత ఉత్సవాలు మూడోరోజైన బుధవారం కొనసాగాయి. సాయంత్రం 6.30 గంటలకు ఏర్పాటైన కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గాయకుడు, తరంగ గాయకుడుగా కీర్తిని పొందిన ఘోరకవి శ్రీకృష్ణ సంపత్‌కుమార్ గాత్రకచేరీ నిర్వహించారు. యక్ష సంప్రదాయ భజన పద్ధతిలో గత 35 సంవత్సరాలుగా నారాయణ తీర్థ కీర్తనలతో తరంగ గానాన్ని అత్యద్భుతంగా చేస్తున్నారు. అనేక గౌరవాలను పొందారు. తెనాలిలో తన గాత్ర పాండిత్యంతో రసజ్ఞులను మంత్రముగ్ధులను చేశారు. వయొలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై రాయపోలు సుధాకర్ వాద్య సహకారం అందించారు. శ్రీసీతారామ గానసభ అధ్యక్షురాలు పిరాట్ల రమణి, కార్యదర్శి దుర్భా హరిబాబుశాస్త్రి పర్యవేక్షించారు.

వరి పొలాలను పరిశీలించిన మనోహర్



తెనాలిటౌన్: తెనాలి రూరల్ మండలం కొలకలూరు, ఖాజీపేట, హాఫ్‌పేట గ్రామాల్లో హైలెవల్ చానల్ పరిధిలో వరి పంట పొలాలను జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల, గ్రామ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే పట్టణ అభివృద్ధి

- ఇన్‌చార్జ్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్
- ప్రశాంతంగా కౌన్సిల్ అత్యవసర, ప్రత్యేక సమావేశాలు
- అన్ని అంశాలకు ఆమోదం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి చైర్మన్



హాజరైన కౌన్సిల్ సభ్యులు

తెనాలిరూరల్: సమష్టి కృషితోనే పట్టణ అభివృద్ధి సాధ్యమని తెనాలి మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక, అత్యవసర సమావేశాలు ప్రశాంతంగా ముగిశాయి. రెండు సమావేశాల అజెండాల్లోని అన్ని అంశాలకూ కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో తెనాలి పురపాలక సంఘ ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. ఉదయం 11.50 గంటలకు మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ అధ్యక్షతన సమావేశం ప్రారంభమైంది. మున్సిపల్ శానిటరీ మేస్త్రి జంపని రామారావుకు సంబంధించి జనన ధ్రువీకరణ పత్రంలో తప్పుల కారణంగా అతని సర్వీసు పొడిగించబడడం, అధిక వేతనాల చెల్లింపుల గురించి చర్చ జరిగింది. ఈ విధంగా అజెండాలో కేవలం ఒకే ఒక్క అంశం పొందు పరచగా దానిని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించి ప్రత్యేక సమావేశాన్ని ముగించారు.

అత్యవసర సమావేశం..

ప్రత్యేక సమావేశం ముగిసిన వెంటనే అత్యవసర సమావేశాన్ని కొనసాగించారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన సమావేశంలో అజెండాలో పొందు పరిచిన మొత్తం 30 అంశాలు ఆమోదించారు. పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ల ఆమోదం, కొందరు కాంట్రాక్టర్లు టెండర్లు వేసినప్పటికీ చాలా కాలంగా పనులు ప్రారంభించకపోవడంతో ఆయా పనులను రద్దు చేయడం వంటి అజెండాలో పొందుపరిచిన అంశాలు సమావేశంలో చర్చకు వచ్చాయి. దాదాపు గంటపాటు సమావేశం కొనసాగింది. అజెండాలో ఉన్న అన్ని అంశాలను సభ్యులు ఆమోదించారు. కాగా మధ్యలో పలువురు కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లోని సమస్యలను కౌన్సిల్‌లో ప్రస్తావించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, ఆవుల కోటయ్య, షేక్ ఇస్మాయిల్, మల్లెబోయిన సువర్ణరేఖ, కఠారి రత్నకుమారి, దాసరి వీరవసంతరావు, మానసారెడ్డి, కె.యశోద, బోయపాటి అరుణ, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు తదితరులు తమ తమ వార్డుల్లో సమస్యలను చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ దృష్టికి తీసుకు వచ్చారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. వాటి పరిష్కారానికి అధికారులు హామీ ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, మున్సిపల్ ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం, రెవెన్యూ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే శివకుమార్
- దావులూరులో గ్రామ సచివాలయం ప్రారంభం



దావులూరులో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

దావులూరు(కొల్లిపర): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందించేందుకు, పరిపాలనను ప్రతి గడప వద్దకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. దావులూరు గ్రామంలో రూ.44లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే శివకుమార్ పార్టీ నాయకులు దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, ఎంపీపీ భీమవరపు పద్మావతి, తెనాలి వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ అవుతు సీత, ఎంపీడీఓ విజయలక్ష్మి, సర్పంచ్ అంబటి సంధ్యాదేవి, ఉప సర్పంచ్ గాజుల రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బొల్లి ముంత పోతురాజు, పంచాయతీ రాజ్ డీఈ గుప్తా, ఎంపీటీసీ అద్దంకి బోసుబాబులతో కలసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశం ఏవిధంగా ఉండాలి అన్న విషయంపై ఆనాడు బాపూజీ కన్న కలలను ఈనాడు రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వార్డు, గ్రామ సచివాలయ వ్యవస్థ తీసుకు వచ్చి 2వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేసి ప్రతి 50 ఇళ్లకు ఓ వలంటీర్‌ను నియమించి ప్రజల ఇళ్ల వద్దకే సేవలందించటం జరుగుతుందన్నారు. రైతులకు రైతుభరోసా పథకం ద్వారా 5వ సారి 2వ విడతలో కొల్లిపర మండలంలో 8008 మంది రైతులకు రూ.3కోట్ల 20లక్షలు, తెనాలి మండలంలో 8575 మంది రైతులకు రూ.3కోట్ల43లక్షలు కలపి మొత్తం రూ.6కోట్ల63లక్షలు నేరుగా వారి ఖాతాల్లో జమచేయటం జరుతుందన్నారు. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లోనూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తొలుత సచివాలయం నిర్మించిన కాంట్రాక్టర్ అద్దంకి బోసుబాబును సత్కరించారు. అద్దంకి వేణుగోపాల్‌గౌడ్, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, పల్లె మధుసూధనరావు, నాదేండ్ల శ్రీను, సూర్యం, కోట శివనాగేశ్వరరావు, భీమవరపు సంజీవరెడ్డి మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, ఎ.శివారెడ్డి, అడపా నారాయణరెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి, కళ్ళం వెంకటప్పారెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో మెరుగైన వైద్యం



వల్లభాపురం సచివాలయం 2 పరిధిలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ

వల్లభాపురం(కొల్లిపర): గ్రామీణ ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటివద్దనే రోగులకు, దీర్ఘకాలిక రోగులకు ఉచితంగా మెరుగైన వైద్యసేవలు, మందులు అందిస్తున్నామని మండల వైద్యాధికారిణి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ అన్నారు. మండలంలోని వల్లభాపురం గ్రామంలో సచివాలయం -2 పరిధిలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో వైద్యాధికారి 163 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, అంగన్ వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు మరియు బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు వలన తేలికపాటి వర్షాలు, చలి పెరగటం జరుగుతుందని దీనిద్వారా శ్వాసకోస పరమైన వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గోరువెచ్చని తాగునీరు సేవించాలని సూచించారు. 104 సిబ్బంది బొమ్ము కోటిరెడ్డి, సూపర్‌వైజర్ సాయిబాబు, హెల్త్ సూపర్‌వైజర్ నాగమలేశ్వరరావు, ఆశావర్కర్లు, ఏఎన్ఎమ్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'పల్లెకు పోదాం'

తెనాలిటౌన్: తెనాలి రూరల్ మండల గ్రామాల్లో ఈ నెల 9వ తేదీ గురువారం నుంచి 21వ తేదీ వరకు 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.ప్రతాపరెడ్డి బుధవారం తెలిపారు. గ్రామాల్లోని సచివాలయాల్లో మధ్యాహ్నం మూడు గంటలకు సమావేశాలు నిర్వహించాలని, సంక్షేమ పథకాల బోర్డులు ప్రదర్శన ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామంలోని ప్రజలకు సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతను పెంచుతూ, అందిన సంక్షేమ పథకాలను తెలియజేస్తూ సమావేశాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. సచివాలయాల వారీగా ఈ నెల 9న అంగలకుదురు-1, 10న బుర్రిపాలెం, 14న మల్లెపాడు, 15న కంచర్లపాలెం, 16న జగ్గడిగుంటపాలెం, 17న పెదరావూరు-1, 20న సంగంజాగర్లమూడి, 21న కఠెవరం-2 సచివాలయాల్లో సమావేశాలు నిర్వహిస్తామని ప్రతాపరెడ్డి తెలిపారు.

ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించండి



తెనాలిఅర్బన్: ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని మండల విద్యాధికారి-1 మేకల లక్ష్మీనారాయణ సూచించారు. ప్రైమరీ పాఠశాలలో వ్యవస్థను బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైమరీ పాఠశాలలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తరచు తనిఖీలు చేయాలని సూచించారు. అలాగే స్కూల్ రికార్డులను కూడా పరిశీలించాలన్నారు. సమావేశంలో ఎంఈఓ-2 వి.జయంతిబాబు, పలువురు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు



వివరాలను వెల్లడిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

పెదనందిపాడు: విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఈఈ కె.వి.ఎల్.ఎస్. మూర్తి తెలిపారు. పెదనందిపాడు మండలంలో బుధవారం సిబ్బంది 2,658 సర్వీసుల్ని తనిఖీ చేశారు. విద్యుత్ చౌర్యానికి సంబంధించి రెండు కేసులు నమోదు చేసి రూ.1,50,000, అదనపు లోడ్ కింద 121 సర్వీసులకు రూ.7,04,000, మాల్ ప్రాక్టీస్ కింద ఒక కేసుకు రూ. 5,000 జరిమానా విధించినట్లు ఈఈ కె.వి.ఎల్.ఎస్. మూర్తి తెలిపారు. మొత్తం 8,89,000 అపరాధ రుసుం వసూలు చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో బాపట్ల విద్యుత్ ఈఈ జి. ఆంజనేయులు, డెప్యూటీ ఈఈలు పి.వి.ఆర్. మల్లికార్జునరావు, ఎం.శ్రీనివాసరావు, పెదనందిపాడు ఏఈ బి. వీరాంజనేయులు, బాపట్ల డివిజన్ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

శలపాడులో 559 మందికి కళ్లజోళ్లు పంపిణీ

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



వృద్ధురాలికి కళ్లజోడు అందజేస్తున్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: మండలంలోని శలపాడులో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళ్లజోళ్ల పంపిణీని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అంధత్వ సమస్య నివారణకు బజరంగ్ ఫౌండేషన్ కృషి చేస్తోందని తెలిపారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నేత్ర జ్యోతి పేరుతో వైద్య శిబిరాల్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉచిత నేత్ర వైద్య శిబిరాల అనంతరం వైద్యసేవల్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. జగనన్న సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకుని కుల, మత, వర్గ, వర్ణ, రాజకీయాలకు అతీతంగా ఈ సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. శలపాడులో 613 మంది నేత్ర పరీక్షలు చేయించుకోగా, సమస్య ఉన్న వారందరికీ వారం రోజుల్లోనే 559 మందికి కళ్లజోళ్లను అందించినట్లు చెప్పారు. వివిధ గ్రామాల్లో నిర్వహించిన నేత్రజ్యోతి శిబిరానికి అనూహ్య రీతిలో స్పందన లభిస్తోందని తెలిపారు. అనంతరం శలపాడు గ్రామ ప్రజలు ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు చెబుతూ, జగనన్న చిత్రపటాలను ప్రదర్శించారు.

వ్యక్తి అదృశ్యం



ప్రత్తిపాడు: కంపెనీ క్వార్టర్స్ నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం, పొట్లపాడుకు చెందిన జవ్వాది నరేంద్రబాబు రెండు సంవత్సరాలుగా ప్రత్తిపాడు మండలం నడింపాలెం లోని ఆది శివం యార్న్ టెక్స్‌టైల్స్ కంపెనీలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అక్కడే కంపెనీ క్వార్టర్స్‌లో భార్యాపిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. దసరా సెలవుల నేపథ్యంలో గత నెల 15న భార్యాపిల్లలను అత్తింట్లో వదిలిపెట్టాడు. అప్పటి నుంచి కంపెనీ క్వార్టర్స్‌లో ఒక్కడే నివాసం ఉంటున్నాడు. అదే నెల 21వ తేదీ సాయంత్రం బయటికి వెళ్లి నేటి వరకు తిరిగిరాలేదు. నాటి నుండి ఇప్పటి వరకు వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో, బుధవారం తండ్రి సాంబశివరావు ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్‌ఐ రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు ప్రత్తిపాడు పోలీసులను సంప్రదించాలని ఆయన సూచించారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించండి




బంద్ సందర్భంగా విద్యార్థులను బయటకు పంపిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తెనాలిఅర్బన్: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించడంతో పాటు కడప ఉక్కు కర్మగార నిర్మాణాలను వెంటనే జరపాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యాసంస్థల బంద్‌ను నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు పట్టణంలో పర్యటిస్తూ విద్యాసంస్థలను మూయించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పారిశ్రామిక వేత్తలకు కేంద్ర ప్రభుత్వం అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. లాభాల్లో ఉన్న ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయాలని కేంద్రం చూడటం బాధకరమన్నారు. ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అలాగే కడప స్టీల్ ఫ్యాక్టరీ వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్ది కిరణ్‌బాబు, నాయకులు చెన్నూరి సాయి, గుండు శివ, కుంభ రవితేజ, బిళ్ళ రాజేష్, అన్నం హేమచరణ్, కావేటి యశ్వంత్, కుప్పల కృష్ణ, పాశం వినయ్, కుర్రా పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో సర్వర్ మొరాయింపు

మంగళగిరి: స్థానిక ఆల్ ఇండియా మెడికల్ ఇనిస్టూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్)లో సర్వర్ మొరాయించింది. బుధవారం ఆస్పత్రికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో రోగులు చేరుకున్నారు. తొలుత నంబర్ తీసుకుంటే త్వరితగతిన వైద్యం చేయించుకోవచ్చని తెల్లవారుజామునే చేరుకున్న రోగులకు సర్వర్ పని చేయడం లేదని ఓపీ నంబర్ కేటాయించలేమని సిబ్బంది చెప్పారు. షుగర్, బీపీ, రక్త పరీక్షలకు ఏమి తినకుండా వచ్చిన రోగులు తీవ్ర ఇక్కట్లు పడాల్సి వచ్చింది. రోగులు ఎంత ఆగ్రహం వ్యక్తం చేసినా అధికారులు, వైద్యులు కనీసం స్పందించలేదు. మధ్యాహ్నం వరకు గంటల తరబడి వేచిఉన్న రోగులు ఇక సహించలేక ఆసుపత్రి అధికారులు, వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెనుతిరగారు. ప్రధానంగా ఎయిమ్స్‌లో అధికారులు, వైద్యులు నిర్లక్ష్యంతో ఇక్కట్లు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. సర్వర్‌లలో తలెత్తిన సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో కూడా చెప్పలేని స్థితిలో ఎయిమ్స్ సిబ్బంది ఉన్నారు. సర్వర్ల నిర్వాహకంపై వివరణ అడిగేందుకు ఎంత ప్రయత్నించినా ఫోన్లు కూడా ఎత్తడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

మిర్చి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన



ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడిలో బుధవారం మిర్చి పంటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పంట పొలాలకు జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ ఉపసంచాలకుడు పి.రామాంజనేయులు మాట్లాడుతూ మిర్చి పంటకు బొబ్బర తెగులు ప్రధాన సమస్యగా మారిందని చెప్పారు. ఇది తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందుతుందని దీనిని నివారించినట్లయితే తెగులు నివారణ సాధ్యమన్నారు. దీని కోసం ఎకరాకు 20 నుంచి 30 వరకు పసుపు రంగు జిగురు అట్టలు అమర్చడం అలాగే వేప గింజల కషాయాన్ని పిచికారీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో లాం శాస్త్రవేత్త ఫణికుమార్, ఏఓ వాసంతి, కేంద్ర వనరుల వ్యవసాయ శాఖాధికారి రాజవంశీ పాల్గొన్నారు.



వర్షంతో జలమయమైన రోడ్డు

తెనాలిలో కుండపోత

తెనాలిఅర్బన్: తెనాలిలో బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ ఉన్నా మధ్యాహ్నం తరువాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. చల్లబడి మబ్బులు పట్టడంతో ఒక్కసారిగా చినుకులు పడ్డాయి. సుమారు గంటపాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో తెనాలి పట్టణంలోని బోసు రోడ్డు, గాంధీచౌక్, మారీసుపేట, ఇస్లాంపేట, చినరావూరు, ఐతానగర్, తదితర ప్రాంతాల్లోని రోడ్లన్నీ నీటి తో నిండిపోయాయి. ఉద్యోగులు తమ కార్యాలయాల నుంచి విధులు ముగించుకొని ఇంటికి వెళ్లే సమయం కావడంతో కొంత ఇబ్బంది పడ్డారు. వర్షం ఆగిన కొద్దిసేపటికి రోడ్లపై నిలిచిన వర్షం నీరు అంత మురుగు కాల్వల ద్వారా బయటకు వెళ్లాయి.

రెండు బైక్‌ల అపహరణ

చేబ్రోలు: మండలంలో బైక్ దొంగతనాలు పెరిగిపోతున్నాయి. ఒకే ప్రాంతంలో మంగళవారం రాత్రి రెండు బైక్‌లు అపహరణకు గురవ్వడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చేబ్రోలు నుంచి వడ్లమూడి వెళ్లే రహదారిలో వాటర్ ట్యాంక్ ప్రాంతంలో నివసిస్తున్న నాగిశెట్టి ఉదయకుమార్ రాత్రి ఇంటి ముందు బైక్‌ను పార్కింగ్ చేశారు. ఉదయం లేచి చూసేసరికి మాయమైంది. ఇదే ప్రాంతంలో ఎస్. సురేష్‌బాబుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని దొంగలు అపహరించుకు పోయారు. ఇద్దరు చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాతరెడ్డిపాలెం ప్రాంతంలో కూడా మరో బైక్ మాయమైనట్లు తెలిసింది.

అడ్డూ అదుపులేని చోరీలు

కొద్ది రోజుల కిందట నారాకోడూరు పాత కెనరా బ్యాంక్ ప్రాంతంలో సాయంత్రం సమయంలో షాపు ముందు ఉంచిన కొత్త బైక్‌ను దొంగలు మాయం చేశారు. నాలుగు రోజుల కిందట సుద్దపల్లిలో ఇంటి ముందు ఉంచిన మైలా చింతయ్యకు చెందిన బైక్ చోరీకి గురైంది. గత నెల రోజుల్లో మండలంలోని గ్రామాల్లో 20 వరకు బైక్‌లు దొంగతనానికి గురైనట్లు సమాచారం. పోలీసుల కళ్లు గప్పి దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ఫిరంగిపురం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యురాలు ఫరీనాబేగం అన్నారు. మండలంలోని బేతపూడిలో బుధవారం వైఎస్సార్ ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 200 మందికి వైద్యపరీక్షలు చేశారు. అందులో 70 మందికి షుగర్, బీపీ పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ పాఠశాల, ఎంపీపీ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు పరీక్షలు చేశారు. ఈసందర్భంగా సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలన్నారు. వర్షంలో తడవకుండా ఉండాలని చెప్పారు. సాధ్యమైనంత వరకు వేడిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు.

త్వరితగతిన గృహాలు నిర్మించుకోవాలి

ఫిరంగిపురం: జగనన్న గృహనిర్మాణ లబ్ధిదారులు త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని ఫిరంగిపురం, 113 త్యాళ్లూరు, తక్కెళ్లపాడు గ్రామాల లేఅవుట్లలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం సిమెంటు, ఇసుక, ఇనుము అందజేస్తున్నట్లు వివరించారు. అంతేకాక డ్వాక్రా ద్వారా రుణాలు ఇస్తున్నారని వాటిని వినియోగించుకొని నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.